

# నింగీ నేలా మావే

**అడుగుతీసి వేయడమే వాళ్లకి కష్టం. తల్లిదండ్రుల ఊతంతో బడికివెళ్లారు. స్నేహితుల సాయంతో కాలేజీలో చదువుకున్నారు. ఇప్పుడు తమ (లేని)కాళ్లపై నిలబడగలుగుతున్నారు. వారిలో మార్పు తీసుకొచ్చింది 'సీపీడీఎల్' సంస్థ.**

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సరస్వతి హైదరాబాద్‌లోని 'హెచ్‌డీఎఫ్‌సీ' అనుబంధ సంస్థలో టెలీకాలింగ్ ఆఫీసర్. జీతం నెలకు రూ.7600. అందరిలాంటి అమ్మాయైతే ఆమె గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. పోలియో కారణంగా ఆమె రెండు కాళ్లూ చిన్నప్పుడే చచ్చుబడ్డాయి. తండ్రి రోజూ భుజాలపై ఎక్కించుకొని సరస్వతిని కాన్వెంట్‌కు తీసుకువెళ్లేవాడు. తర్వాత హైస్కూల్, కాలేజీకి మూడుచక్రాల సైకిల్‌మీద వెళ్లి చదువుకుంది. డిగ్రీ చేతికొచ్చాక తల్లిదండ్రులు తనకోసం పడ్డశ్రమకు ఓ అర్థాన్నివ్వాలనుకుంది. సరస్వతి ఆశలు, ఆశయాలు పరుగుతీసినా, వైకల్యం ఆమెను ఎటూ కదలనివ్వలేదు.

'టాటా బిజినెస్ సర్వీస్'లో హిందీ శిక్షకుడిగా పనిచేస్తున్న రఫియుద్దీన్‌దీ అయిదు నెలల కిందటివరకూ ఇదే పరిస్థితి. ఊళ్లో చేయడానికి పనిలేదు. నగరం వెళ్లి ఉద్యోగం చేయడానికి ధైర్యం చాల్లేదు. ఆ సమయంలో వీరికి 'సెంటర్ ఫర్ పర్సన్స్ విత్ డిజెబిలిటీ లైవ్లీహుడ్స్(సీపీడీఎల్)' గురించి తెలిసింది. అక్కడ శిక్షణతో జీవితానికి భరోసా వచ్చింది. ఇప్పుడు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని తల్లిదండ్రులకూ పంపుతున్నారు.

### వికలాంగులకోసమే

కాలూచెయ్యీ బాగున్నవారు ఎక్కడైనా, ఎలాగైనా బతకగలరు. అవిటితనంతో బాధపడేవారి పరిస్థితి అలాకాదు. అందుకే వారి కోసం ప్రత్యేక సంస్థను స్థాపించారు మీరా షెనాయ్. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కల్పన విభాగంలో కొన్నాళ్లు పనిచేసిన మీరా... వికలాంగులకు ప్రత్యేకంగా సేవచేయాలని సీపీడీఎల్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని పేదరిక నిర్మూలన విభాగం, గ్రామీణాభివృద్ధి శాఖల సహకారంతో పాటు మరికొన్ని స్వచ్ఛంద సంస్థల సాయంతో ఆమె ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. ఎనిమిదో తరగతి, ఆపై చదువుకున్న వికలాంగులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగంలో చేర్పించడం వీరి ఉద్దేశం. హైదరాబాద్, నల్గొండ, వరంగల్, విశాఖపట్నం, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో మొత్తం 14 సీపీడీఎల్ శిక్షణ కేంద్రాలున్నాయి. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఈ సంస్థకు చెందిన కార్యకర్తలున్నారు. వీరు కూడా శారీరక వైకల్యం ఉన్నవారే. ఆయా జిల్లాల్లో వైకల్యం ఉన్నవారిని గుర్తించి ఆసక్తికి అనుగుణంగా దగ్గర్లోని శిక్షణకేంద్రంలో చేరుస్తారు. అభ్యర్థుల చదువు, సామర్థ్యం ఆధారంగా వారికి శిక్షణ ఇస్తారు. ఎనిమిదో తరగతి వరకూ చదివిన వారికి వస్త్ర పరిశ్రమల్లో పనిచేసేందుకు, డైమండ్ కటింగ్, ప్యాకింగ్‌లో... పదో తరగతి అర్హత ఉన్న వారికి డేటా ఎంట్రీ, హాస్పిటాలిటీ, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణనిస్తారు. వీరికి తమ పట్టణాల్లోనే ఉపాధి చూపిస్తారు. డిగ్రీ, పీజీ అర్హతలు ఉన్నవారికి ఆటోక్యాడ్, బ్యాంకింగ్ రంగాల్లో ప్రవేశించేందుకు కావాల్సిన మెలకువలు నేర్పుతారు. సాధారణంగా ఒక్కో కేంద్రంలో ప్రతి మూడునెలలకూ 25 మందికి శిక్షణ ఇస్తారు. సంస్థ ప్రధాన కార్యాలయంలోని మోడల్ సెంటర్‌లో కార్పొరేట్ సంస్థల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తారు. ఆంగ్లంలో మాట్లాడటంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి కాల్‌సెంటర్, ఫ్రంట్ ఆఫీస్, బ్యాంకు ఉద్యోగాలకు సరిపడేలా తీర్చిదిద్దుతారు. వీరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి మాక్ ఇంటర్వ్యూలు, వివిధ కంపెనీల సందర్శనలూ ఏర్పాటు చేస్తారు. గతేడాది అక్టోబరులో ప్రారంభమైన మొదటి బ్యాచ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 142 మంది శిక్షణ తీసుకోగా 120 మందికి ఉపాధి లభించింది. ఇక్కడ విద్యార్థులకు బోధన, వసతి, రవాణా సౌకర్యాలు ఉచితం. 40 శాతంపైన వైకల్యం ఉన్నవారినే ఈ శిక్షణకు ఎంపికచేస్తారు.

### కార్పొరేట్ వితరణ

సీపీడీఎల్ సేవల్ని ప్రోత్సహించే విధంగా కొన్ని కార్పొరేట్ కంపెనీలు శారీరక వైకల్యం ఉన్నవారికి తమ సంస్థల్లో ఉద్యోగాలిచ్చేందుకు ముందుకొచ్చాయి. హైదరాబాద్‌తో పాటు చెన్నై, బెంగళూరులలోని 30కిపైగా కంపెనీలు సీపీడీఎల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందినవారికి ఉపాధి చూపిస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ ఫైనాన్స్, టాటా టెలీ సర్వీసెస్, కేఎఫ్‌సీ, స్పెన్సర్స్.. ఇలాంటి కొన్ని సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. 'లాభనష్టాలతో బేరీజు వేసుకోకుండా సమాజసేవలో భాగంగా వైకల్యం ఉన్నవారికి ఉద్యోగాలిస్తున్నాం. కాల్‌సెంటర్‌లో పని చేయడానికి ఆంగ్లభాషపై అవగాహన, మంచి ఉచ్చారణ ఉంటే చాలు. సీపీడీఎల్ అభ్యర్థులు ఈ విభాగంలో మంచి నైపుణ్యాన్ని చూపిస్తున్నారు' అని చెబుతారు టాటా టెలీ సర్వీసెస్ ప్రతినిధి ప్రమోద్. ఈ సంస్థ అయిదుగురు సీపీడీఎల్ విద్యార్థుల్ని ఉద్యోగులుగా నియమించుకుంది.

*– దేవీప్రసాద్, న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్*

## త్వరగా నేర్చుకుంటారు


*- మీరా షెనాయ్, ఈడీ సీపీడీఎల్*
ఫోన్: 040-23551213




మా కేంద్రంలో చేరక ముందు విద్యార్థులు ఎంతో నిరాశతో ఉంటారు. శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత వారిలో అన్నిరకాలుగా మార్పువస్తుంది. నైపుణ్యాలు మెరుగవుతాయి. మేమిచ్చే శిక్షణ ఆటపాటలతోనే ఉంటుంది. ఇంగ్లిష్‌లో ఉండే దరఖాస్తులు నింపడం, ఆంగ్ల పత్రికలు చదవడం అలవాటు చేస్తాం. కంప్యూటర్ విద్య నేర్పిస్తాం. మిగతావారితో పోల్చుకుంటే అంగవైకల్యం ఉన్నవారు త్వరగా నేర్చుకుంటారు, అప్పగించిన పనిని తొందరగా పూర్తిచేస్తారు. అనవసరంగా తిరగకుండా ఇచ్చిన పనిచేసుకోవడం వీరికి ప్లస్ పాయింట్. దాతలు ముందుకు వస్తే సేవల్ని మరింత విస్తరిస్తాం.